క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాంగ్రెస్ నాయకుడు శాంసన్ రోగులకు, వారి సహాయలకు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కోఆప్షన్ మెంబర్ మహిమూద్, అప్పంపల్లి సింగిల్ విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, గంజి బాల్‌రాజు, శ్రావణ్, ప్రతాప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

చిన్నచింతకుంట: నల్లకుంట తండాలో సోమవారం ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించారు. రెండు లీటర్ల సారాను పట్టుకొన్నారు. అదేవిధంగా తహసీల్దార్ సి. కృష్ణయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సుష్మ తెలిపారు. తండాకు చెందిన లక్ష్మి వద్ద సారా పట్టుబడిందన్నారు. కాగా మరోసారి సారా కాచినా, నిల్వ చేసినా కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు.

ఇసుక టిప్పర్ సీజ్

నవాబుపేట: మండలపరిధిలోని రుద్రారం సమీపంలో సోమవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదండాపూర్ ప్రాజెక్టు నుంచి జిల్లా కేంద్రానికి ఇసుక తరలిస్తుండగా పట్టుబడినట్లు వివరించారు. కాగా డ్రైవర్ పరారయ్యాడని.. ఈ మేరకు టిప్పర్ యజమాని సత్యనారాయణపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది

మహమ్మదాబాద్: కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జీకే మాస్టర్ షాట్‌కన్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని అన్నారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా తమకు ప్రావీణ్యం ఉన్న రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాంలాల్, విష్ణురెడ్డి, కేశవులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

భూత్పూర్: మూసాపేట మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంపీఓ సరోజకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ కాలంలో సబ్బులు, నూనెలు, డ్రస్‌లు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉన్నాయని.. ప్రస్తుతం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తిమృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు..బాదేపల్లికి చెందిన మద్దూరి శ్రీనివాసులు((45) ఈనెల 27న బైక్‌పై స్థానిక సిగ్నల్ గడ్డ వైపు నుంచి గంగాపూర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే వైద్య చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆదివారం రాత్రి అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీనివాసులు కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడులు సరికావు

పాలమూరు: ఏబీవీపీ నాయకులు సమాజానికి ఏదైనా చెప్పాలనుకుంటే సభల ద్వారా చెప్పుకోవాలని.. ఇతరులు ఏర్పాటు చేసుకున్న సభలలో భౌతిక దాడులకు దిగడం సరికాదని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాయంలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులోకి ముగ్గురు ఏబీవీపీ కార్యకర్తలు అరుస్తూ రావడం, మరోసారి మరో పదిమందితో అక్కడ ఉన్న వారిపై దాడులకు పాల్పడం సరైన పద్ధతి కాదని అన్నారు. బీజేపీ అధికారంలో ఉందని ఇలాంటి దాడులకు పాల్పడరాదని, రాముడి పేరుతో దాడులకు దిగితే చరిత్ర క్షమించదని తెలిపారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులను ముంచిన చరిత్ర కాంగ్రెస్‌దే..

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు, ఆశీర్వదిస్తే.. పాలమూరుకు నీళ్లు తీసుకువచ్చి పాదాలు కడుగుతానని.. రైతులను ముంచిన చరిత్ర కాంగ్రెస్‌దని వారిని నమ్మవద్దని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో సోమవారం నిర్వహించిన కిసాన్ మోర్చా ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. అదేవిధంగా ముదిరాజ్‌లను బీసీ–డి నుంచి ఏ లోకి మార్చాలనే అంశంపై గతంలో అసెంబ్లీలో మాట్లాడినట్లు.. అప్పటి సీఎం దృష్టికి తీసుకువెళ్లి కమిషన్ వేయించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ముదిరాజ్‌లను పట్టించుకోలేదన్నారు. సోమవారం ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఓటమిని విశ్లేషించు.. గెలుపు మార్గం అన్వేషించు



- నేడు పదో తరగతి ఫలితాల నేపథ్యంలో నిపుణుల సూచన

పాలమూరు: పరీక్ష తప్పామనో మార్కులు తక్కువగా వచ్చాయనో కొందరు విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు ఏటా చోటుచేసుకుంటున్నాయి. చిన్న సమస్యలను పెద్దవిగా ఊహించుకుని, పరిష్కారమే లేదన్నట్లుగా ఆత్మహత్యలకు పాల్పడుతుండడం భవిష్యత్ తరాల విషయంలో ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం పదో తరగతి ఫలితాల నేపథ్యంలో నిపుణుల సూచనలు ఇలా..

చదువులో రాణించడం లేదనే బాధలో ఉన్నవారికి మనోధైర్యం కల్పించడం, సమస్యకు పరిష్కార మార్గం చూపి ప్రోత్సహించడమే సరైన విధానమని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఓటమితో కుంగిపోకుండా అందుకు కారణాలను విశ్లేషించుకోవాలని.. ధైర్యంగా మంచి భవిష్యత్ కోసం మార్గాలను అన్వేషించాలని చెబుతున్నారు.

అదేవిధంగా ఫలితాలప్పుడు పిల్లల మానసిక ప్రవర్తనను గమనించాలని సూచిస్తున్నారు. సబ్జెక్టుల్లో తప్పినా మానసిక స్థైర్యం చెప్పాలని... ఇతర పిల్లలతో పోల్చి కుంగిపోయేలా చేయొద్దంటున్నారు. ప్రయత్నం చేశావు ఫలితం రాలేదని.. ఈసారి గట్టిగా ప్రయత్నించాలని ప్రోత్సాహించాలని, తమ బాధ స్వేచ్ఛగా చెప్పుకొనే వాతావరణాన్ని కల్పించాలని సూచిస్తున్నారు. తదుపరి పరీక్ష సన్నద్ధతలో సాయం చేయడం, ఉపాధ్యాయులు, విజేత విద్యార్థుల సహకారం తీసుకొని, యోగా, ప్రాణయామ సాధన విశ్రాంతితో ఒత్తిళ్ల నుంచి బయటపడేలా చేయాలంటున్నారు. ' గెలుపోటములు పగలూ రేయిలాంటివి. ఒక్క సబ్జెక్టు తప్పినంత మాత్రాన అమ్మానాన్నలు, ఇరుగుపొరుగు ఏమనుకుంటున్నారోనని విద్యార్థులు దిగులు చెందొద్దు' అని మానసిక నిపుణులు చెబుతున్నారు. గణాంకాలు ఎలా ఉన్నా ఆత్మహత్యలపై ప్రజలలో అవగాహన లేమి మాత్రం తీవ్రంగా ఉందని విశ్లేషిస్తున్నారు. విస్తతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు.

ఇలాంటి లక్షణాలు ఉన్నాయా.. జాగ్రత్తపడండి

- ఆత్మహత్య అనేది సమాజంలో ఎన్నో అపోహలు, భయాలతో కూడిన అంశంగా భావించబడుతోంది.
- ఒక వేళ ఒక వ్యక్తి ఆయా లక్షణాలతో బాధపడుతున్నా విషయాన్ని గుర్తించడం లేదు.
- సాధారణంగా ఒత్తిడిలో ఉన్నా.. ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచించేవారికి ఏ విషయంపైనైనా ప్రతికూల ఆలోచనలు ఎక్కువగా వస్తాయి.
- లేచినప్పటి నుంచి ఉత్సాహం ఉండదు.
- ఏరోజుకారోజు చేసే పనులపై దృష్టి పెట్టలేరు.
- ఒంటరిగా ఉండాలని ఎక్కువగా అనిపిస్తుంది.
- నిద్ర, ఆహారం పూర్తిగా తగ్గిస్తారు.
- చాలా వరకూ నిరాశలో ఉంటారు.
- ఏదైనా పనిచేస్తే త్వరగా అలసిపోతారు.
- దేనిమీదా ఆసక్తి ఉండదు.
- చిరాకు లేదా కోపం ఎక్కువగా ఉంటుంది.
- చావు, చనిపోవడం, ఆత్మహత్య గురించి తరచుగా మాట్లాడుతారు.
- ఈ నేపథ్యంలో మార్పు జరగాలని, ఆత్మహత్య అనేది ఒక మానసిక సమస్య అని ప్రజలందరూ గుర్తించాలని... ఇలాంటి లక్షణాలు విద్యార్థుల్లో కనిపిస్తే తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని.. వారిలో మనోధైర్యం పెంచగలిగే ప్రయత్నం చేస్తే ఆత్మహత్యలు అరికట్టడం సులభమని నిపుణులు అంటున్నారు.

తక్కువ చేసి మాట్లాడొద్దు

నేడు పదో తరగతి ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో కొంత మంది విద్యార్థులు మార్కులు మార్కులు ఎక్కువగా రాలేదని, ర్యాంకులు రాలేదని మానసిక బలహీనత వల్ల ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉంది. ఇలాంటి సమస్యల నుంచి బయటపడటానికి 14416 అనే టోల్ నంబర్‌కు ఫోన్ చేస్తే భవిష్యత్‌కు కావాల్సిన సూచనలు, సలహాలు అందిస్తారు. మానసిక సమస్యలతో బాధపడే విద్యార్థులు టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలి. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సాహించాలి తప్పా.. మార్కులు తక్కువగా వచ్చాయని తక్కువ చేసి మాట్లాడటం సరికాదు.

–డాక్టర్ కృష్ణ, డీఎంహెచ్‌ఓ

ఒత్తిడికి సంబంధించి స్ట్రెస్ అట్రిబ్యూషన్ థియరీ అనేది ఉందని నిపుణులు చెబుతున్నారు. దీన్ని 3 రకాలుగా బేరీజు వేస్తుంటారు. దాని ఆధారంగా కారణాలు గుర్తించి సాధారణ జీవితం గడిపేలా చేయవచ్చు. తొలుత ఒత్తిడికి కారణం ఎవరన్న విషయాన్ని గుర్తించాలి. తనకు తానుగా ఒత్తిడికి గురవుతున్నాడా..లేదా బయటి పరిస్థితుల కారణమవుతున్నాయా అన్నది గుర్తించాలి. రెండోది ఒత్తిడి ప్రభావం ఎంత మేరకు అనేది తెలుసుకోవాలి.ఏదైనా ఒక అంశంలో నిరాశకులోనైతే అది అక్కడికే పరిమితమన్న విషయం గుర్తుంచుకోవాలి. జీవితంలోని అంశాలకు దాన్ని అన్వయించుకోవడం మంచిదికాదు. మూడోది ఒత్తిడి స్థిరమైనదా..లేదా అస్థిరమైనదా? అన్నది ముఖ్యం. అపజయం ఎదురైతే అదికేవలం అక్కడికే పరిమితం అన్నది తెలుసుకోవాలి. అదే శాశ్వతమనుకుని నిరాశ చెందరాదు.ప్రతి సమస్యకు పరిష్కారం ఉందని గుర్తుంచుకోవాలి.

టెలీ మానస్‌తో అండ:

మానసిక సమస్యలతో బాధపడే విద్యార్థులకు కౌన్సెలింగ్, సలహాలిచ్చేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేకంగా టెలీ మానస్ ఏర్పాటు చేసింది. హెల్ప్ లైన్ నంబర్ 14416,1800–891–4416 టోల్ ఫ్రీని 24గంటల్లో ఎప్పుడైనా సంప్రదించి కౌన్సిలర్లు, మానసిక నిపుణులతో మాట్లాడొచ్చు.

వర్గీకరణపై ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటించాలి



తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్‌-ఆర్‌ఆర్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నామంటూ ప్రతి రాజకీయ పార్టీ మాదిగ ఓట్ల కోసం 25 ఏళ్ల నుంచి ప్రతి ఎన్నికలకు ముందు తీర్మానాలు, కమిషన్లు, కమిటీల పేర్లతో మోసం చేస్తూనే ఉన్నాయని.. ఎమ్మార్పీఎస్ –ఆర్‌ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్, రాష్ట్ర సలహాదారు సింగిరెడ్డి పరమేశ్వర్ ఆరోపించారు. సోమవారం తెలంగాణ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్‌–ఆర్‌ఆర్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణకు మద్దతు అంటూనే మాదిగలను పార్లమెంట్‌కు పోకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వర్గీకరణపై ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజగాని అశోక్, ఎల్.రమేష్, మల్లెల అనిల్‌కుమార్, తిరుమలయ్య, వినోద్, పద్మమ్మ, కాలె నరేందర్, రాజు, యాంకి రమేష్, రామకృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటకు కట్టుబడి ఉంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పెద్దర్పల్లిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏకకాలంలో రూ. లక్ష రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టులో 15లోగా రుణమాఫీ చేస్తామని, ఆరుగ్యారంటీలను అర్హులైన వారికి అమలు చేస్తామన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై విమర్శలు చేశారు. కార్యక్రమంలో ఎం సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మన్నెమ్మ, యాదయ్యగౌడ్, బీమేష్, కేశవులు, ఖాదరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని.. ఆ దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎల్కిచర్ల, శేరిపల్లి (హెచ్), హస్నాపూర్ గ్రామాల్లో ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే హక్కులేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండయ్య, మాజీ ఎంపీటీసీ తిరుపతయ్య, నాయకులు సంజీవరెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బాలవర్ధన్‌రెడ్డి, అచ్చన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా ప్రచారం చేయాలి



ప్రచారం చేస్తున్న అశ్లేషారెడ్డి

మహమ్మదాబాద్: చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ఉపాధిహామీ కూలీల దగ్గరకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

గండీడ్: కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెన్నాచేడ్ శివాలయం, షిరిడి సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. పీసీసీ మెంబర్ నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మిడ్జిల్: దోనూర్, వస్పుల, మసిగొండ్లపల్లి, వేముల తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం సతీమణి అశ్లేషారెడ్డి సోమవారం జడ్చర్లలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



చిన్నచింతకుంట: గ్రామాల్లో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఆర్ శేఖర్ అన్నారు. సోమవారం అప్పంపల్లిలో సురక్ష పోలీస్ కళాబృందం చేత సామాజిక మాధ్యమాలు, దురలవాట్లపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది, కళాజాత బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు న్యాయం



బాలానగర్: బీఆర్‌ఎస్ ఎంపీలో అధిక సంఖ్యలో గెలుపొందితేనే కేంద్రంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు గురించి గట్టిగా మాట్లాడేందుకు అవకాశం ఉంటుందని వైస్ ఎంపీపీ వెంకటాచారి అన్నారు. సోమవారం బాలానగర్ పరిధిలో పర్యటించారు. మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు. జీసీసీ మాజీ చైర్మన్ వాల్యానాయక్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సుప్ప ప్రకాష్, జగన్ నాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం గండీడ్ మండల కేంద్రంలో ఉమ్మడి మండల బూత్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, గండీడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు పెంట్యానాయక్, భిక్షపతి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉండరాదు



మాట్లాడుతున్న ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి

అడ్డాకుల: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీపీ డి.నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సభకు ఎంపీడీఓ బి.శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాధిక, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎం.జితేందర్‌రెడ్డి, ఎంపీఓ విజయకుమార్ హాజరయ్యారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు వినిపించారు. కాగా గృహజ్యోతి అమలవుతున్నా 200 యూనిట్ల లోపు కరెంటు బిల్లులు వచ్చే వారితో ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని వైస్ ఎంపీపీ రాధిక విద్యుత్ శాఖ ఏఈని నిలదీశారు. వెంటనే వాటిని నిలిపివేయాలని కోరారు. కాగా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి ఉచితంగా ఇసుక ఇచ్చే ఏర్పాట్లు చేయాలని గుడిబండ ఎంపీటీసీ సభ్యురాలు శకుంతల రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చారు. తమ గ్రామంలో అవసరమైన వారికి ఇసుక తరలించుకునేలా అనుమతి ఇవ్వడం లేదని సభ దృష్టికి తెచ్చారు. కాగా నిబంధనల ప్రకారం అవకాశం ఇస్తున్నట్లు గిర్దావర్ సాహత్ ఇషాన్ తెలిపారు. సూపరింటెండెంట్ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రదీప్, ఏఓ శ్రీనివాసులు, పశువైద్యాధికారి రాజేష్‌ఖన్న, ఎంఈఓ నాగయ్య, ఏపీఎం సుధీర్‌కుమార్, ఏపీఓ అతహర్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ అధ్యక్షతన సాదాసీదాగా కొనసాగింది. వేసవి కాలం ఉన్నందున గ్రామాల్లో మంచి నీటి కొరత ఏర్పడకుండా చూడాలని ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులను కుట్టిస్తున్నట్లు ఏపీఎం విష్ణుచారి సభలో వివరించారు. గ్రామాల్లో 24 రేషన్ దుకాణాల ద్వారా 2,070 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైస్ ఎంపీపీ సుమతి, మండల కోఆప్షన్ మెంబర్ మహిమూద్, ఏఈపీఆర్ కురుమూర్తి, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ ఉన్నారు.

బీడీ కార్మికుల చర్చలు విఫలం



సమావేశంలో పాల్గొన్న ఫ్యాక్టరీ యజమానులు, కార్మిక సంఘాల నాయకులు

చిన్నచింతకుంట: బీడీ కూలి పెంపుపై హైదరబాద్‌లో ఫ్యాక్టరీల యజమానులకు, కార్మిక యూనియన్ సంఘాల నాయకులకు జరిగిన చర్చలు విఫలమైనట్లు ఐఎఫ్‌టీయూ నాయకుడు జేఎస్ దేవదానం తెలిపాడు. సోమవారం హైదరబాద్‌లోని బషీర్ షేట్ ఆఫీస్‌లో జరిగిన ఈ చర్చల్లో కార్మిక నాయకులు వెయ్యి బీడీలు చుడితే రూ. 240 చెల్లించాలని డిమాండ్ చేయగా ఇదివరకు రూ. 207 ఇచ్చేవారమని.. ఇప్పుడు రూ. 217 ఇస్తామని ఫ్యాక్టరీల యజమానులు తెలిపారు. దీంతో చర్చలు విఫలం అయినట్లు నాయకులు తెలిపారు.

'క్రమబద్ధీకరణ' ఏది...?

- ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- ఇబ్బందులు పడుతున్న పంచాయతీ సిబ్బంది



జానంపల్లిలో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

గండీడ్: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారే కీలకం. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, ఫాగింగ్, బ్లీచింగ్, పన్నుల వసూలు వంటి ఎన్నో పనులను చేస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో వారి కృషి ప్రశంసనీయం. అయినా మల్టీపర్పస్ కార్మికులను పట్టించుకునే నాథుడే లేదు. ప్రభుత్వాలు మారినా వారి తలరాత మాత్రం మారడం లేదు. వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, వేతనాలు పెంచుతామని చెపుతున్న ప్రభుత్వాలు వారి గోడును పెడచెవిన పెడుతున్నాయి. ఫలితంగా ఏళ్ల తరబడి చేస్తున్న పనిని వదులుకోలేక చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తూ బతుకుబండిని భారంగా ఈడుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 7,420 మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. వారు చేసే పనికి తగ్గ వేతనం కాని గుర్తింపు కాని ఉద్యోగ భద్రత కాని లేదు. దీంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



కంచన్‌పల్లిలో పనులు చేస్తున్న కార్మికులు

గత ప్రభుత్వం 2020లో 51 జీఓ తీసుకువచ్చింది. అప్పటి నుంచి గ్రామపంచాయితీలో పనిచేసేవారిని మల్టీపర్పస్ వర్కర్లుగా గుర్తించారు. దీని ప్రకారం అందరు సిబ్బంది అన్నిరకాల పనులు చేయాలని నిర్దేశించారు. దీంతో అప్పటి నుంచి దాదాపు అన్ని రకాల పనులు వీరు నిర్వర్తిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం వీరికి రూ. 8500 వేతనం నిర్ణయించింది. కాగా ఇది ఏమూలకు సరిపోవడం లేదని కార్మికులు 2023లో ఆందోళన చేయడంతో రూ. 1000 పెంచారు. కానీ అవి కూడా నెల నెలా సక్రమంగా రావడం లేదు. జిల్లాలో హన్వాడ, గండేడ్, మహమ్మదాబాద్, కోయిల్‌కొండ మండలాల్లో మూడు నుంచి ఆరు నెలల వరకు కూడా వేతనాలు అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు రూ. 30 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.



కాల్వలను శుభ్రం చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లు

అన్ని పనులు చేయిస్తున్నారు



గ్రామంలో అన్ని పనులు చేయిస్తున్నారు. ఆరు గంటల నుంచి రాత్రి ఎడెనిమిది వరకు కూడా పనిచేయాల్సి వస్తుంది. పర్మినెంటు చేస్తారని చెప్పడంతో మౌనంగా కష్టం అయినా చెప్పిన పనులు చేస్తున్నాం. వారిచ్చే జీతాలు ఎందుకు సరిపోవడం లేదు. అవి కూడా సకాలంలో ఇవ్వడం లేదు. అడిగితే ఈరోజు రేపు వస్తాయని చెపుతున్నారు. పిల్లలను చదివించడం, కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా ఉంది. ఇకనైనా మా కష్టాన్ని గుర్తించి న్యాయం చేయాలి.

– తలారి లక్ష్మి, మల్టీపర్పస్ వర్కర్, వెన్నాచేడ్

51 జీఓను ఎత్తేయాలి...

గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబరు 51ని ఎత్తేయ్యాలి. మల్టీపర్పస్ వర్కర్లుగా మార్చి పంచాయతీ కార్మికుల చేత వెట్టి చాకిరి చేయిస్తున్నారు. 51 జీఓను ఎత్తివేసి పనిని వివిధ విభాగాలుగా విభజించి ఎవరు చేయాల్సిన పనులు వారికి అప్పజెప్పాలి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వారిని రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం. కనీసం వారికి రావాల్సిన వేతనాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. ఇలా అయితే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయి. ఇప్పటికైనా ఉద్యోగ భద్రత కల్పించాలి.

– సి. వెంకటేశం, ఐఎఫ్‌టీయూ, రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం



నృత్యకళాకారిణిని సత్కరిస్తున్న సభ్యులు

జడ్చర్ల టౌన్: అంతర్జాతీయ నృత్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం సంస్కారభారతి, ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నృత్యకళాకారులను ఘనంగా సత్కరించారు. ఇటీవల జాతీయ ఉగాది పురస్కారం అందుకున్న చిగుళ్లపల్లి సంధ్యను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆమెతోపాటు పట్టణంలోని మరికొందరు నృత్య కళాకారులను ఘనంగా సత్కరించారు. సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షురాలు పద్మలీల, సొసైటీ అధ్యక్షురాలు బాలమణి పాల్గొన్నారు.